# ముగింపు

-రాజేంద్ర ప్రసాద్

రైలు దూరాలను దాటుకుంటూ కదిలిపోతూంది. దూరంగా ఉన్న కొండలు మెల్ల మెల్లగా దగ్గర అవుతున్నాయి. పక్కనున్న పొలాల్లో రైతులు వ్యవసాయం పనులు చేసుకుంటున్నారు. కిటికీ దగ్గరున్న సీట్లో మూర్తి బయటకు చూస్తూ కూర్చొన్నాడు. తూర్పు కొండల్లోనించి అప్పుడే బయట పడ్డ సూర్యుడు ప్రకృతిని పలకరిస్తున్నాడు. బయట నుంచి వీస్తూన్న చల్లని గాలి ఒంటికి తగులుతుంటే హాయిగా ఉంది. కిటికీలోంచి కనబడుతున్న సుందర దృశ్యాలను చూస్తున్న మూర్తి ఊహాల్లో రమణ మెదిలాడు. 'ఇన్నాళ్ళకు మళ్ళీ తను రమణను కలవబోతున్నాడు. రమణలో ఏమన్నా మార్పు వచ్చిందేమో చూడాలి' అనుకొన్నాడు. అతను, రమణ బి. ఎస్‌సి. వరకు కలిసి చదువుకొన్నారు. చదువయిన వెంటనే రమణకు తిరుపతిలో ఉద్యోగం దొరికింది. నిజానికి అతనికి ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదు. కాని, రమణ పట్టుదల మూలంగా అతని తండ్రి ఎవరిచేతో రికమండ్ చేయించి ఉద్యోగం తెప్పించాడు. మూర్తికి ఒక సంవత్సరం తరవాత ఇప్పుడు రమణ పనిచేస్తున్న ఆఫీసులోనే ఉద్యోగం దొరికింది. ఈ మధ్యలో మూర్తి వివాహం కూడా అయింది.

పాత సంగతులన్నీ తలుచుకుంటున్నాడు మూర్తి. రమణది ఓ వింత స్వభావం. ఎవరికే చిన్న కష్టం వచ్చినా ఇట్టే కరిగి పోతాడు. అతను ఎప్పుడూ అంటుండేవాడు—"ఈ జీవితం ఓ పెద్ద ఆక్సిడెంట్, మూర్తీ! మనిషిగా పుట్టడమే ఒక ఆక్సిడెంట్ అయితే, ప్రతి రోజూ ఏదో ఆక్సిడెంట్ జరక్కుండా బతకడం మరో ఆక్సిడెంట్! ఏ కారు కిందో పడి చస్తేనే ఈ ఆక్సిడెంట్లన్నిటికీ ఫుల్‌స్టాప్!" అని.

మూర్తి కతన్ని చూస్తే అనిపించేది, 'ఇతర్ల కష్టాల మీద అంత దయ చూపించే రమణకు తన మీద తనకి అంత నిర్దయ ఎందుకని? అతను రమణనెప్పుడూ మందలిస్తూ ఉండేవాడు, ఆక్సిడెంట్ల గురించి మాట్లాడవద్దని.

రమణ నవ్వేసి—"ఫర్వాలేదులే కాని, నేను ఏ కారు కిందో పడి చచ్చిపోతే మాత్రం బాధపడకు. నా కంతకన్నా సంతోషకరమైన దేదీ లేదు. దట్ విల్ బి ది హాపియస్ట్ మూమెంట్ ఇన్ మై లైఫ్" అనేవాడు.

'ఆ రమణ ఇప్పు డెలా ఉన్నాడో! తన చిన్నప్పటి నుంచి బి.ఎస్‌సి. వరకు అతని ఆక్సిడెంట్ మెంటాలిటీలో ఏమీ మార్పు రాలేదు. మరి ఉద్యోగ ప్రభావం ఏదన్నా ఉందేమో చూడాలి ...' రైలు ఆగడంతో మూర్తి ఆలోచనలకు బ్రేకు పడింది. బయటకు చూశాడు మూర్తి. "తిరుపతి" ... 'అరే, స్టేషను వచ్చేసిందే!' అనుకుంటూ సూటుకేసు తీసుకొని క్రిందికి దిగాడు.

మూర్తి క్రిందికి దిగడంతోనే—"మూర్తీ!" అని పెద్దగా కేక వినబడింది. దూరంగా రమణ పెద్ద పెద్ద అడుగులు వేసుకొంటూ వస్తున్నాడు. అతని వేపు చేయి ఊపాడు మూర్తి. రమణ అతని దగ్గిరికి వచ్చి ఆప్యాయంగా భుజంమీద చేతులు వేశాడు, "ఎన్నాళ్ళకుకనబడ్డావురా మళ్ళీ" అంటూ.

పోర్టరుకి సూట్‌కేస్ ఇచ్చి బయటికి నడిచా రిద్దరూ. మూర్తి తను పాత మిత్రుల సంగతులు చెబుతున్నాడు. రిక్షా ఎక్కిన తరవాత అడిగాడు మూర్తి! "ఉద్యోగం ఎలా ఉందిరా?"

"రేపట్నించి నీకూ ఇదే ఉద్యోగం కదా! చూద్దువుగాన్లే." రమణ నవ్వాడు.

"అదికాదోయ్ నే నడిగేది. ఈ ఉద్యోగం నీకు ఎలా ఉంది?" అన్నాడు మూర్తి, "నీకు" అనే పదాన్ని ఒత్తి పలుకుతూ.

రమణ పకపకా నవ్వాడు. "నాకా ... మా నాన్న రికమండ్ చేసి ఉద్యోగం తెచ్చి పెట్టి నా లైఫ్‌లో పెద్ద ఆక్సిడెంట్ చేశాడు. అఫ్‌కోర్స్, నే నడిగితేనే ననుకో. నే నీ ఉద్యోగంలో చేరకుండా ఉన్నట్లయితే ఎవడో ఒక పూర్ గ్రాడ్యుయేట్‌కి దొరికుండే దిది. నాకిది రావడంతో పాపం—ఎవరికో పెద్ద ఆక్సిడెంట్."

మూర్తి నిట్టూర్చాడు. 'వీడూ, వీడి ఆక్సిడెంట్లూ... వీ డిక మార డంతే.'

రమణ రూముకి చేరుకొని, స్నానం చేసి కూర్చున్నాడు మూర్తి. రమణ అడిగాడు: "మరి మా వదిన గారిని ఎప్పుడు తీసుకు వస్తావురా?"

మూర్తి చిరునవ్వుతో అన్నాడు: "ఇక ఇల్లు చూడటం మొదలెట్టాలి. ఇల్లుదొరకగానేరమ్మనిఉత్తరంరాస్తాను."


"చూస్తుంటే నువ్వు ఇప్పుడే రమ్మని రాసేట్టున్నావే! అదేం కుదరదు. ఒక నెల రోజులన్నా నువ్వు నాతో కలిసి ఉండాలి ఈ రూములో. మనం కాలేజీలో చదువుకొనే రోజుల్లో ఒకే రూములో ఉన్నప్పటిఅనుభవాలు గుర్తులేవూ నీకు?" ఆ తరవాత ఇద్దరూ పాత విషయాలు ముచ్చటించుకున్నారు.

• • •

తరవాతి రోజు ఉదయం ఇద్దరూ కలిసి ఆఫీసుకు వెళ్ళారు. మూర్తి జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తరవాత, రమణ అతన్ని అందరికి పరిచయం చేశాడు. మూర్తి ఆఫీసులోని వాళ్ళకు కూల్ డ్రింక్సు తెప్పించాడు.

అంతా అయిన తరవాత రమణ అన్నాడు: "మూర్తీ! ఇందాకా నీకు పరిచయం చేశాను—గుర్తుందా, రంగయ్య అని మన ఆఫీసులో సీనియర్ గుమాస్తా? ఆయన్ని చూస్తుంటే ఏమీ అనిపించలా నీకు?" గంభీరంగా ఉన్న రంగయ్య రూపం మెదిలింది మూర్తి కళ్ళ ముందు. అతను జీవితంలో ఎన్నో దెబ్బలు తిన్న వ్యక్తిలా కనిపించాడు మూర్తికి.అదే అన్నాడు రమణతో అతను.

రమణ బాధగా అన్నాడు: "పాపం! రంగయ్య తన ఏభై ఏళ్ళ జీవితంలో వెయ్యేళ్ళకు సరిపడా కష్టాలు అనుభవించాడు. చేతికందిన కొడుకు ఆర్మీలో చనిపోయాడు. పెళ్ళి కెదిగిన కూతుళ్ళు, రోగిష్టి భార్యతో నానా బాధలూ




ఊహాచిత్రం
టి. మోహన్‌దాస్ (మద్రాసు—16)

పడుతున్నాడు. ఇలాటి రంగయ్యలు మన దేశంలో ఎంత మందో! పాపం, అలాటి వాళ్ళకి ప్రతి రోజూ ఆక్సిడెంటే.'' రమణ కళ్ళలోని భావానికి మూర్తి ఆశ్చర్య పోయాడు.

కొద్ది రోజుల్లోనే గ్రహించాడు మూర్తి, రంగయ్యంటే ఆఫీసులోని వారందరి మనస్సుల్లోను ఉన్నత స్థానం ఉందని. ఓ పది రోజులు గడిచేసరికి రంగయ్యతో మంచి చనువేర్పడింది మూర్తికి. ''బాబూ'' అంటూ ఆప్యాయంగా పిలిచే రంగయ్యతో మాటాడుతూంటే ఫిలాసఫర్‌తో మాటాడినట్టే ఉండేది మూర్తికి. ఎప్పుడూ గంభీరంగా ఉండే రంగయ్య గుండెల్లో ఎన్ని అగ్ని పర్వతాలో అనిపించేది!

• • •


ఒక రోజు మూర్తి, రమణ కలిసి తిరుమలకు బయలుదేరారు. మెలికలు తిరిగిన రోడ్డు మీద పోతున్న బస్సు లోంచి ప్రకృతి మనోహరంగా కనబడుతూంది. కొండల ఎత్తుల్లోంచి సౌందర్యపు లోతులు చూస్తున్న మూర్తి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రమణ అన్నాడు: ''తిరుమలకు ఈ బస్సుల్లో ఎన్నో సార్లు ఇలా వెళ్ళాను. డ్రైవరు బస్సు నడుపుతున్నప్పుడు నా కనిపించేది ఎప్పుడూ — ఏదో ఆక్సిడెంట్ జరగబోతున్నదని. అఫ్‌కోర్స్! ఏమీ జరగ లేదనుకో... అసలు ఈ రోడ్డు మీద నించి బస్సు బోర్లి పడిపోతేఎంతమంది బతుకుతారంటావు?''

మూర్తి విసుక్కున్నాడు. ''అబ్బబ్బ... నీతో ఎప్పుడూ ఇదే గోల. ఏం బాగురా ఆక్సిడెంట్లో ఏ కాలో, చెయ్యో విరగ్గొట్టుకుంటే?''

''నీకేం తెలుసు లేరా ఆక్సిడెంట్లో ఉండే ఎడ్వెంచర్! అసలు చచ్చిపోతే ఆక్సిడెంట్‌లోనే చావాలి—తెలుసా?''

మూర్తి—'వీడు మంచి మూడ్‌లో లే' దని ఇంకేం మాట్లాడకుండా ఊరుకున్నాడు.

రమణ ఆలోచిస్తున్నాడు. 'ఎంత చాకచాక్యంగా వేశారీ రోడ్డు! ఇంత ఎత్తు మీద బస్సుకి కంట్రోలు తప్పితే...' మూర్తికి భయంగా ఉన్నట్టుంది. పాపం, ఈ మధ్యనే పెళ్ళయింది కదూ! ఇప్పుడు ఆక్సిడెంట్ జరిగి, తను చచ్చిపోతే ఎలా ఉంటుందో? మూర్తి ఏమనుకుంటాడు? ఊహు, లాభం లేదు. ఈ డ్రైవరు చాలా జాగ్రత్తగా పోతున్నాడు.''



మొత్తానికి తిరుమల ప్రయాణం క్షేమంగానే జరిగింది. మళ్ళీ ఆక్సిడెంట్లను గూర్చి దారిలో రమణ ఏమీ మాట్లాడనందుకు సంతోషించాడు మూర్తి.

• • •

ఆ రోజు మధ్యాహ్నం ఆఫీసులో అంతా హడావిడిగా ఉంది. రంగయ్య పెద్ద కూతురికి పెళ్ళి సంబంధం కుదిరింది. పెళ్ళి శుభలేఖలు అందరికీ ఇచ్చాడు రంగయ్య. అతనంటే ఆఫీసులో అందరికీ సానుభూతి, ఓ విధమైన గౌరవభావం ఉన్నాయి. అతని కుటుంబం పరిస్థితులు, కూతురికి సంబంధం కుదరడానికి అతను పడ్డ బాధలు. అందరికీ తెలుసు. రంగయ్య మీద భారం కొంత తగ్గిపోతున్నందుకు అందరూ సంతోషించారు.

రంగయ్య ఆ పెళ్ళికి కట్నంకోసం మూడు వేలు అప్పు చేస్తున్నాడని తెలిసి ఆశ్చర్యపోయాడు రమణ. రంగయ్య నడిగాడు; ''రంగయ్యగారూ! మరి అంత బాకీ ఎలా తీరుస్తారు? పెళ్ళి కావలసిన అమ్మాయి లిద్దరు ఉన్నారు కదా ఇంకా?''

''ఇంకేం చేయమంటావు, బాబూ! ఇప్పటికీ భారం తగ్గితే కొంతలో కొంత నయం కదా!''

''అది నిజమే ననుకోండి. కాని, భవిష్యత్తు సంగతేమిటి?''

''నా ఊళ్ళో ఉన్న నా ఇల్లు అమ్మేద్దా మనుకుంటున్నాను. ఇంకా ఎవరూ కొనడానికి రాలేదు. మంచిబేరం కుదిరితే ధర అయిదారు వేలు పలుక వచ్చు'' అన్నాడు రంగయ్య.

''మరి ఇప్పుడు అప్పెక్కడ చేస్తున్నారు?'' అని మూర్తి అడిగాడు.

''ఈ ఊళ్ళో ఉన్న మార్వాడీ ఇస్తానన్నాడు'' అన్నాడు రంగయ్య. ఆ తరవాత పెళ్ళికి రమ్మని అందరికీ చెప్పి, సెలవు పెట్టి పెళ్ళి పనుల మీద వెళ్ళాడు రంగయ్య.

పెళ్ళి ఇంకా పది రోజు లుంది. తిరుపతికి నలభై మైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూళ్ళో పెళ్ళి. ఆఫీసులోని వారంతా తలా కొంత వేసుకొని మూడు వందల రూపాయలు చేర్చారు. దానితో ఏం ప్రెజెంటేషన్ కొనాలో తేలక పెళ్ళిలో డబ్బే చదివించాలని అనుకొన్నారు.

• • •

ఈ మధ్యలో మూర్తికి ఇక్కా

దొరికింది. భార్యను తీసుకుని బావమరిది వస్తానని ఉత్తరం రాశాడు.

ఇంతలో పెళ్ళి దగ్గర పడింది — ఇంకా రెండు రోజులే. రమణ ఆఫీసులో కూర్చొని ఉన్నాడు. మూర్తి ఆ రోజు ఆఫీసుకు రాలేదు. భార్యతోబాటు వెంట బంధువులు కూడా రావటంతో సెలవు పెట్టాడు.

"బాబూ!" రంగయ్య స్వరానికి రమణ తల ఎత్తి చూశాడు. "ఓ...మీరా? రండి, ఇలా కూర్చోండి. ఏర్పాట్లన్నీ చేశారా?" అన్నాడు.

రంగయ్య వదనంలో విచారం తాండవిస్తూంది. గద్గద స్వరంతో అన్నాడు: "ఇంకేం ఏర్పాట్లులే, బాబూ. ఇక ఆ పెళ్ళి జరగదు."

రమణ ఉలిక్కిపడ్డాడు. "అదేమిటండీ! అస లేం జరిగింది?" తలకొట్టుకొని అన్నాడు రంగయ్య: "అంతా నా ఖర్మ, బాబూ! మార్వాడీ కట్నానికి డబ్బు ఇస్తానంటే పట్టుకు వెళ్దామని వచ్చా నీ రోజు. వాడు హఠాత్తుగా బిగుసుకుని కూర్చున్నాడు. ఎంత ప్రతిమాలినా డబ్బు ఇవ్వనన్నాడు."

రమణ నోటి వెంట మాట రాలేదు. "మరి ... ఇప్పు డెలా?" అన్నాడు.

"ఇంకెలాగేముంది, బాబూ. ఊళ్ళోకి వెళ్ళి పెళ్ళి పందిరి పీకేసి వస్తాను. నా వియ్యంకుడు జగమొండి. కట్నం డబ్బు ముందే ఇవ్వాలని కరాఖండీగా చెప్పేశాడు. ఏం చెయ్యను? అంతా నా కూతురి ప్రారబ్ధం."

రమణ కొంచెంసేపు మాటాడలేక పోయాడు. అతని మెదడులో హఠాత్తుగా ఓ ఆలోచన మెరిసింది. చటుక్కున తల ఎత్తి అన్నాడు: "రంగయ్యగారూ! మీరేం భయపడకండి. ఈ పెళ్ళి ఆగి పోదు. నా దగ్గిర రెండు వేల సొమ్ముంది. మిగతాది ఎక్కడో ఓ చోట చూద్దాం."

రంగయ్యలో ఆశాకిరణం వెలిగింది. రమణ దగ్గిరికి వచ్చి అతని చేతులు పట్టుకున్నాడు. "రమణ బాబూ! ఈ మేలు చేశావంటే నీ పేరు జన్మజన్మలకూ మరవను. నా చర్మంతో నీకు చెప్పులు కుట్టిస్తాను."

ఎప్పుడూ గంభీరంగా ఉండే రంగయ్య అలా మాటాడడం రమణకు బాధ కలిగించింది. ఆయన్ని వారిస్తూ అన్నాడు: "ఛ ఛ! అవేం మాటలండీ? మీరు నా తండ్రి లాంటి వారు. అలా మాటాడకండి."

రంగయ్య మౌనంగానిలబడిపోయాడు. రమణ టైము చూసుకొని—"అరే, ఈవేళ బాంక్ టైము అయిపోయిందే. రేపు ఆదివారం కూడా ... అయినా, ఫర్లేదు. ఎల్లుండి కదా పెళ్ళి?"

"ఎల్లుండి సోమవారం సాయంత్రం నాలుగింటికి, బాబూ, పెళ్ళి. ఒక్క గంట ముందు డబ్బు అందినా చాలు." రంగయ్య ఆత్రతగా అన్నాడు.

"అయితే, ఈ లోగా మిగిలిన డబ్బు చూసి, సోమవారం బాంకులో ఉన్న నా డబ్బుకూడా తీసుకొని మీ ఊరు వస్తాను. మీరు మాత్రం ఈ సంగతి నాకు వదిలేసి, మిగతా పనులన్నీ చూసుకోండి."

రంగయ్యకు ధైర్యం చెప్పి పంపించి, రమణ మూర్తి ఇంటికి వెళ్ళాడు. అతనికి సంగతంతా చెప్పాడు. మూర్తి దగ్గిర నాలుగు వంద లుంది. ప్రజెంటేషన్ డబ్బు మూడు వందలు. మిగిలిన మూడు వందలు ఆఫీసులో పనిచేస్తున్న మరో ఇద్దరి దగ్గిర అప్పు చేసి తెచ్చారు మూర్తి, రమణ.

• • •

ఆ రోజే పెళ్ళి. ఇంట్లో ఉన్న బంధువుల మూలంగా పెళ్ళికి రాలే నన్నాడు మూర్తి. ఇక రమణ ఒక్కడే బయల్దేరాడు. బాంకు పనంతా పూర్తి చేసుకొని బస్‌స్టాండ్ చేరుకున్నాడు.

అతను ఎక్కవలసిన బస్సు పది కొండు గంటలకు వచ్చింది. బస్సును చూసి గబగబా దానివైపు నడుస్తున్న రమణ చేతిలోనించి డబ్బు ఉన్న బాగ్ జారి పడింది. చటుక్కున దాన్ని వంగి తీసుకొని గట్టిగా పట్టుకొన్నాడు. 'ఈ బాగ్ విలువ ఇప్పుడు కేవలం మూడు వేలే కాదు. రంగయ్య జీవితం, ఆయన కూతురి జీవితం దీనితో ముడిపడి ఉన్నాయి. ఇది పోతే ... అమ్మో! ఇంకే మన్నా ఉందా!' తన ఆలోచనలకు తిట్టుకున్నాడు రమణ.

ఎక్కి కూర్చున్న అరగంటకి మెల్లిగా కదిలింది బస్. "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాడు రమణ. బస్‌స్టాండ్ దాటి, టౌన్లో పరిగెడుతున్న బస్ సడెన్ బ్రేక్‌తో ఒక్కసారిగా ఆగింది. ఆ కుదుపుకి రమణ తల ముందు సీట్ బార్‌కి కొట్టుకుంది. 'ఎవడీ డ్రైవర్? చూస్తుంటే దేనికో గుద్దేట్టున్నాడు వెధవ.' రమణ గుండె దడదడమంది. 'ఈ బస్‌కి ఆక్సిడెంట్ అయితే ఇంకేమన్నా ఉందా!' రమణ మస్తిష్కంలో పెళ్ళి పీటల మీద నుంచి లేచి పోతున్న పెళ్ళి కొడుకూ, అతని కాళ్ళ దగ్గర పడి ఏడుస్తున్న రంగయ్యా, ఆయన కూతురూ మెదిలారు. రమణ ఆ ఊహను చెరిపేయడానికి ప్రయత్నిస్తూ అనుకున్నాడు: 'ఛఛ! అలా జరగదు. ఈ డబ్బు సమయానికి అందుతుంది. పెళ్ళి చక్కగా జరిగిపోతుంది.'

రమణ పక్కనున్నతను చుట్ట వెలిగించాడు. ఆ వాసనకు రమణ కడుపులో తిప్పసాగింది. చుట్ట ఆర్పేయమని చెబితే బాగుండదేమోనని ఊరుకున్నాడు రమణ. ఇంతలో బస్ ఆగింది. కండక్టర్ వెనక్కి తిరిగి అన్నాడు: "ఎవరయ్యా అది, బస్సులో చుట్ట కాలుస్తున్నారు?"

రమణ పక్క నున్నాయన మొండి లాగా ఉన్నాడు. "ఏమయ్యా చుట్ట కాలిస్తే? అవతల డ్రైవరు సిగరెట్టు కాలవటంలా?" అన్నాడు. కండక్టర్ గయ్యిమని లేచాడు ఆ పెద్ద మనిషిమీద. రమణ విసుగ్గా టైము చూసుకొన్నాడు. 'అబ్బ! అవతల పెళ్ళి టైము దగ్గిర పడుతూంటే ఏమి టీ ఆలస్యం! ఈ ఆలస్యం కన్నా ఆ చుట్ట పొగే నయం' అనుకున్నాడు.

కండక్టరూ, చుట్టాయనా మధ్య పోట్లాట మొదలయింది. అందరు కలిసి సర్దిచెప్పి చుట్టని పారేయించారు. బస్ కదిలింది. రమణ ఊపిరి పీల్చుకున్నాడు. 'టౌన్ లిమిట్స్ దాటి బస్సు వేగంగా దూసుకు పోతూంది. ఈ డ్రైవర్ చూస్తూంటే మహా నిర్లక్ష్యం మనిషి లాగే ఉన్నాడు. అంత స్పీడుగా పోతాడేం? ఆక్సిడెంటేం చెయ్యడు కదా!' దీనంగా ఉన్న రంగయ్య మెదిలాడు రమణ కళ్ళ ముందు. 'ఈ డ్రైవరు కాస్త మెల్లిగా పోతే బాగుణ్ణు' అనుకున్నాడు రమణ. బస్సుకి ఎదురుగా లారీ ఏదైనా వచ్చి నప్పుడల్లా గుండె బిగపట్టుకుని కూర్చున్నాడు రమణ.

డ్రైవరు హుషారుగా నడుపుతున్నాడు బస్సును. బస్సు కుదుపులకి రమణకు ప్రాణంపోతున్నట్లనిపిస్తూంది. ఒడిలోని బాగ్ ఒకసారి తడిమి చూసుకున్నాడు. బస్సుకు ఎదురవుతున్న లారీలనీ, బళ్ళనీ భయంగా చూస్తూ ఆలోచించసాగాడు. ఆక్సిడెంట్‌లో ప్రాణం పోవడం అంటే ఇదివరకు తన కెంతో అందంగా ఉండేది. ఇప్పు డీ బస్సు కేమైనా జరిగితే, తన సంగ తెలా ఉన్నా, అవతల రంగయ్య కూతురు పెళ్ళి ఆగి పోతుంది. కుదరక కుదరక కుదిరిన

విరహిణి

చిత్రం— ఎస్. జె. నరసింహారెడ్డి (సికిందరాబాదు)



పెళ్ళి ఆది. అది ఆగిపోతే రంగయ్య ఏమవుతాడు? రంగయ్య కూతురు ... ఇక ఊహించలేక పోయాడు. 'భగవాన్! అంతా సవ్యంగా జరిగేటట్టు చూడు' అనుకున్నాడు రమణ మనసులో.

బస్సు స్పీడుగా టర్నింగ్ తిరిగింది. రమణ కళ్ళకి ఎదురుగా వేగంగా వస్తున్న గూడ్సు ట్రక్కు మెరుపులాగ కనిపించింది. హఠాత్తుగా ఎదురైన ట్రక్కు నుంచి బస్సును తప్పించడానికి డ్రైవరు స్టీరింగును గిరగిరా తిప్పాడు. కాని, ఆ భూతం లాంటి ట్రక్కునుంచి బస్సు తప్పించుకోలేకపోయింది. రెండూ గుద్దుకున్నాయి! "అయ్యో, ఆక్సిడెంట్!" రమణ నోట్లోంచి పెద్దగా కేక వచ్చింది.

ఒక్క క్షణంలో ఆ ప్రదేశం రణరంగంలా మారింది. ఏడుపులూ, కేకలతో భీకరంగా తయారయింది.

• • •

ఆ హాలంతా మూలుగులతో నిండి ఉంది. మంచాల మీద పడుకున్న వ్యక్తుల శరీరాలన్నీ రక్తపు మరక అన్న బాండేజీలతో నిండి ఉన్నాయి. నర్సులు అటూ, ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు. కొందరు గాయపడ్డ వ్యక్తులు బాధతో అరుస్తున్నారు. అంతా గందరగోళంగా ఉంది. ఒక పక్క నున్న మంచం మీద తల చుట్టూ బాండేజీలతో నిండి ఉన్న రమణను పడుకో బెట్టారు. ఒక నర్సు అతని ఒంటి మీది రక్తాన్ని తుడుస్తూంది. అతను చేతులు కొట్టుకుంటూ అరుస్తున్నాడు. "ఆక్సిడెంట్ ...! అయ్యో, దేవుడా, ఆక్సిడెంట్ ...! రంగయ్యకు ఆక్సిడెంట్ ..." రమణ చేతులు పట్టుకొని అతణ్ణి ఆపటానికి ఒక నర్సు ప్రయత్నిస్తూంది. కాని, అతను ఆగటం లేదు. "నో! నో! పెళ్ళిది. ఆక్సిడెంటు రద్దు చేయండి ... పెళ్ళికి ఆక్సిడెంటా? ... నో! నో! ... సారీ, రంగయ్యా ..."

ఇంతలో ఒక నర్సు చకచకా నడుచుకుంటూ వచ్చింది. ఆ బెడ్ దగ్గరున్న డాక్టరుతో అంది: "సర్! ఎవ్విరిథింగ్ ఈజ్ అరేంజ్డ్."

రమణని స్ట్రెచర్ మీదకు మార్చి ఆపరేషన్ థియేటరు లోకి తీసుకెళ్ళారు. థియేటరు తలుపు మూసుకుంది.

• • •

"ఇదేమిటి? పూర్తిచేసినట్టు లేదే?" నే రాసినంత వరకూ కథను చదవటం ముగించి అడిగాడు ఆనందరావు. నేను నిట్టూర్చిఅన్నాను. "అవును. ఆకథపూర్తి కాలేదు. దానికి ముగింపు ఎలాగో నాకు తెలియలేదు." కొంచెం ఆలోచించి అన్నాడు ఆనందరావు: "పెళ్ళి ఆగిపోయినట్టు రాసి, రమణ చనిపోయినట్టు రాయవచ్చుగా?"

నేను ఉలిక్కిపడ్డాను. "నో!నో! అలా రాయలేను ... ఎందుకంటే ... రమణ ఇంకా బతికే ఉన్నాడు." ఆనందరావు ఆశ్చర్యంగా అన్నాడు: "ఈజిట్? అయితే, ఈ కథ ..."

"అవును. ఈ కథ కల్పితం కాదు. నేనే దీనిలోని మూర్తిని" అని కుర్చీ మీది నుంచి లేచి కిటికీ దగ్గరికి వెళ్ళాను.

ఆనందరావు ఆత్రతగా అడిగాడు: "మరి రమణ ఏమయ్యాడు?" కిటికీ లోంచి బయటకు చూస్తూ భారంగా అన్నాను: "ఆ ఆక్సిడెంట్‌లో అతనిది ఒక కాలు తీసేశారు. పాపం, ఎప్పుడూ ఆక్సిడెంటు గురించే ఆలోచించే రమణ ఆక్సిడెంట్ జరక్కూడదని ఎప్పుడైనా కోరుకుంటే బహుశః ఆ బస్సు ప్రయాణంలోనే కోరుకుంటాడు. కాని, అందుకు పూర్తి వ్యతిరేకంగా జరిగింది."

"ఇప్పుడా రమణ ఎక్కడున్నాడు?"

"ఆ ఆక్సిడెంట్లో అతని తలకు గట్టి దెబ్బ తగిలి మెదడు దెబ్బ తింది. దాని మూలంగా రమణ మతి చలించింది. ఇప్పుడతను విశాఖపట్నం మెంటల్ హాస్పిటల్లో ఉన్నాడు."

ఆనందరావు ముఖంలో విచారం కనబడింది. అతను కొంతసేపటికి అడిగాడు: "మరి ఆ పెళ్ళి సంగతేమిటి?"

చిన్నగా నవ్వి అన్నాను: "ఆ ఆక్సిడెంటు జరిగింది ఒక్క రమణకే కాదు; రంగయ్య కుటుంబానికి కూడా. పెళ్ళి ముందు రంగయ్య పెళ్ళి కట్నం డబ్బు తరవాత ఇస్తానని వియ్యంకుడి కాళ్ళావేళ్ళా పడ్డాడు. కాని, అతను నిర్దయగా తిరస్కరించి కొడుకును విడిది నుంచే వెనక్కి తీసుకు వెళ్ళిపోయాడు. పెళ్ళి ఆగిపోవడం వల్ల కలిగిన షాక్ మూలంగా రంగయ్య హార్ట్ ఎటాక్‌తో ఆ రోజే మరణించాడు."

కుర్చీలోంచి చటుక్కున లేచి, నా దగ్గరకు వచ్చాడు ఆనందరావు. "రాఘవ గారూ! ఇది జరిగి ఎన్ని రోజు లయింది?"

ఒక్క క్షణం ఆలోచించి చెప్పాను: "ఇది జరిగిన నెలకు నా కిక్కడికి ట్రాన్స్ఫరయింది. అంటే, దాదాపు మూడు నెలలయింది."

"ఇది జరిగింది మీ రంతకుముందు పనిచేసిన తిరుపతిలోనేనా?" ఆనందరావు గొంతులో ఆత్రత ధ్వనించింది. అవునన్నాను. ఆ తరవాత పెళ్ళి జరగవలసిన చోటు, ఇంకా చాలా వివరాలు అడిగాడు. అతను ఈ విషయంలో ఇంత ఆసక్తి చూపుతున్నాడేమని నా కాశ్చర్యం వేసింది.

అతని ప్రశ్నలన్నింటికీ నేను జవాబిచ్చిన తరవాత కొంత సేపటికి ఆనందరావు అన్నాడు: "రాఘవగారూ! మీ రింతవరకూ రాసిన కథ తరవాతి సంగతులు కూడా రాస్తే, ఆ భాగానికి ఓ విలన్ ఉంటాడు. ఆదెవరో తెలుసా? రంగయ్యకుకాబోయి మానేసిన అల్లుడు— అతడే రంగయ్య మరణానికి బాధ్యుడు." ఆనందరావు మాటల్లో ఆవేదన స్పష్టంగా తెలుస్తూంది.

"ఆ కథ తరవాత ఇంతవరకూ జరిగినది చూస్తే మీ రన్నది నిజమే! కాని, అప్పుడా పెళ్ళి జరిగి ఉన్నట్టయితే, రమణ కథ వదిలేస్తే మిగతా దంతా మామూలుగానే ఉండేది. రంగయ్య కుటుంబం ఇప్పుడు ఆర్థిక మయిన చిక్కులతో, ఎన్నో కష్టాల్లో ఉంది. ఆ కష్టాలు తీరే మార్గం దొరికితే, కథ సుఖాంత మవుతుంది. అదే నే నాశించే ముగింపు."


ఆనందరా వేమీ మాట్లాడలేదు. కొంతసేపయాక, "వస్తా" నని చెప్పి భారంగా అడుగులు వేస్తూ వెళ్ళి పోయాడు. చూస్తుంటే ఆనందరావు నీ సంఘటన కదిలించి వేసినట్టుంది. ఆనంద రావు మరుక్కైన వ్యక్తి. రమణ ఊహలతో నిండి పోయిన తిరుపతిలో గడపలేక ట్రాన్స్ఫర్ చేయించుకొని, అక్కడినుండి వచ్చేసిన నాకు ఆనందరావు పరిచయ మయాడు. ఈ రెండు నెలల్లోనూ నాకు బాగా సన్నిహితు డయాడు.

• • •

మరుసటి రోజు ఉదయం కాఫీ తాగి పేపరు చూస్తూ కూర్చున్నాను. అది మామూలుగా ఆనందరావు వచ్చేసమయం. రోజూ ఆ సమయానికి ఇద్దరం కాసేపు కూర్చొని మాటాడుకొనే వారం. మరి ఆ రోజు ఇంకా రాలే దెందుకో? బయటకు వచ్చి పక్క వాకిలి వంక చూశాను. ఆనందరావు గదికి తాళం వేసి ఉంది. ఇంత ఉదయాన్నే ఎక్కడికి వెళ్ళాడో!

నాగిని

ఎస్. కృష్ణమాచార్యులు (తెనాలి)



# వైద్య విజ్ఞానం

## అతివృష్టి, అనావృష్టి

డాక్టర్ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

ఏటేటా కోసులమైన కోస్తా ప్రాంతాలలో సమవృష్టి ఉంటుంది. అప్పుడప్పుడూ అధిక వృష్టి, అతివృష్టి కూడా సంభవించి అల్లకల్లోలం చేస్తాయి. రాయలసీమ రత్నాల సీమలో అరుదుగా మితవృష్టి, తరుచూ పరిమిత వృష్టి, అడపా దడపా అనావృష్టి తటస్థిస్తూ ఉంటాయి.. ఒక్కొక్కప్పుడు ఆహార ధాన్యాల మాట అటుంచి, కనీసం పశుగ్రాసంకూడా కరవే అయిపోతుంది. తనివితీరా త్రాగడానికి మంచినీరే కరవై పోతుంది.

మన దేశానికీ, రాష్ట్రానికీ ఎలాగో మన శరీరానికికూడా అతివృష్టి, అనావృష్టి, ఉన్నాయి సుమండీ. శ్రీమతి లతోమూర్తికి అతి మూత్రంతో మతి పోతూంది. నిద్ర పోకుండా నిమిష నిమిషానికీ లేచి వెళ్ళే నీరజ పని సరేసరి. వీరిద్దరూ ఇలా సతమతమౌతూ ఉంటే, పొద్దుపోక ముందే పడక సేవించిన పొన్నమ్మ పొట్లంలా పడుకుని బారెడు పొద్దెక్కినా పక్క దిగదు. ఆరోగ్యంగా ఉన్న ఆరింద ఇలా ఉండగా మూడు రోజుల నుంచీ మూత్రం రాక, పొట్ట ఉబ్బిపోయి ముప్పు తిప్పలు పడుతున్నాడు మురళీధరమూర్తి. మూడు రోజుల నుంచీ మూత్రం రాకపోయినా మున లయ్యకు పొట్ట ఉబ్బరం లేదు సరికదా, కళ్ళు లోతురు పోయి, నాలిక పొడిగా ఉండి, చర్మం పొడిగా ముడతలు పడుతూ ఉండి, నాడి హీనంగా ఉండి, ప్రమాద స్థితిలో ఉన్నాడు.

మనం రోజుకు ఎంత మూత్రం విసర్జిస్తామో తెలుసా? మనిషి ప్రతి రోజూ సుమారు 50 ఔన్సులు అంటే 1500 ఘన సెంటిమీటర్లు విసర్జిస్తాడు. వ్యాధి క్రియలలో ఈ పరిమాణంలో హెచ్చు తగ్గులు రావచ్చు.

మంచి నీరు మంచి నీళ్ళ ప్రాయంగా త్రాగే మధుర మీనాక్షమ్మా, కాఫీ కావలసినన్ని సార్లు సాఫీగా త్రాగేసే కాశీ విశ్వేశ్వరయ్యా, కప్పుల మీద కప్పులు టీ కొట్టేసే కంచి కామాక్షయ్యా చీటికీ మాటికీ బాత్‌రూమ్‌కు వెళ్ళక తప్పదు. మంచినీరు, కాఫీ, టీలు అతి మూత్రాన్ని కలిగిస్తాయి. మూత్ర విసర్జనకు తోడ్పడే ఔషధాలు కొన్ని ఉన్నాయి. వీటిని 'డైయూరెటిక్స్' అంటారు. నరాల బలహీనతలోనూ, భావోద్రేక పరిస్థితులలోనూ అధిక మూత్ర విసర్జన జరుగుతుంది. 'వైవా వోసీ' పరీక్షకు వెళ్ళేవిద్యార్థి రాకరాకవచ్చిన 'ఇంటర్వ్యూ'కు వెళ్ళే ఉద్యోగార్థి, లేటయిన రైలు కోసం ఎదురు చూసే అరుదుగా ప్రయాణంచేసే బెదురు మనిషి చీటికీ మాటికీ లఘుశంక కలిగి పరుగుతీస్తాడు. కొందరికి లఘుశంక గురుశంకగాకూడా మారవచ్చు.

మూత్రోత్పత్తి ఎక్కువై, ఎక్కువ సార్లు ఎక్కువ మూత్రాన్ని విసర్జించే పరిస్థితిని 'పాలియూరియా' అంటారు. మూత్రోత్పత్తి మామూలుగానే ఉన్నప్పటికీ అనేక పర్యాయాలు ఒకటికి వెళ్ళవలసి వచ్చే పరిస్థితిని 'ఫ్రీక్వెన్సీ ఆఫ్ మిక్చ్యురిషన్' అంటారు.

ఇలా కాకుండా ఒక్కొక్కప్పుడు మూత్ర విసర్జన క్రియ తగ్గిపోవచ్చు. చాలా తక్కువ ద్రవాలు సేవించినప్పుడూ, ఎక్కువ చెమట పోసినప్పుడూ, జ్వరాలు వచ్చినప్పుడూ మూత్రం పరిమాణం తగ్గిపోవచ్చు. దీనిని 'ఒలిగూరియా' అంటారు.

మూత్రపిండాల వ్యాధుల అంత్య దశలలోనూ, కలరా లోనూ, అభిఘాతం ('షాక్') వగైరా పరిస్థితుల లోనూ మూత్రోత్పత్తికే అవరోధం కలగవచ్చు. మూత్రోత్పత్తి ఆగిపోయిన పరిస్థితిని 'అనూర్యూరియా' అంటారు. ఇలాంటి పరిస్థితులలో మూత్రం రాదు. పొట్టను పరీక్షించి చూస్తే, మూత్రాశయం ఉబ్బి ఉండక, ఖాళీగా ఉంటుంది. కళ్ళు లోతుకు పీక్కుపోయి ఉంటాయి. నాలిక పొడిగా ఉంటుంది. చర్మం పొడిగా ముడతలు పడుతూ ఉంటుంది. యూరియా వగైరా మలినాలు విసర్జింపబడనందు వల్ల, ఇవి రక్తంలో అధికమై, మనిషికి స్పృహ లేకుండా చేస్తాయి. మనిషి మగతగా ఉంటాడు. ఈ పరిస్థితిని 'యూరిమియా' అంటారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి సుమండీ.

అలాకాక, ఒక్కొక్కప్పుడు మూత్రోత్పత్తి మామూలుగానే జరుగుతుంది. కానీ, మూత్ర విసర్జన మండలంలోని ఆటంకాల వల్ల కానీ, బయటి వ్యాధి క్రియల వల్ల కానీ మూత్ర బంధం (రిటెన్షన్ ఆఫ్ యూరిన్) ఏర్పడవచ్చు. అదొక పెద్ద కథ.

ఇలాగ శరీర ప్రక్రియలు బహు విచిత్రమైనవి సుమండీ. అతివృష్టి అయినా కష్టమే, అనావృష్టి అయినా కష్టమే. *

ఎదటివారి ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కించపరిచనంత కాలం, నీవు మంచివాడివే.

—బ్రూరే

• • •

స్వార్థపేమ, అడుగులేని పాత్ర వంటిది. ఎన్ని సరస్సులనైనా దారిలో ఒంపవచ్చు. అది ఎప్పుడూ అంచుల వరకు నిండదు.

—పోప్స్

ఆనందరావు ఆ తరవాతి రోజు కూడా రాలేదు. 'చెప్పనైనా చెప్పకుండా ఏ ఊరికి వెళ్ళాడా!' అని నాకు ఆశ్చర్యం వేసింది. అతను పనిచేస్తున్న ఆఫీసులో కూడా అడిగాను. వాళ్ళూ తెలియదన్నారు. అలాగే పదిహేను రోజులు గడిచిపోయాయి.

• • •

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన నాకు టేబిల్ మీద ఒక ఉత్తరం కనబడింది. అది—ఆనందరావు దగ్గిర నుంచి వచ్చింది.

ఆత్రుతగా విప్పాను.

"రాఘవగారికి,

నేను హఠాత్తుగా ఏమయిపోయానా అని మీరు ఆశ్చర్యపోయి ఉంటారు. నేను క్షేమంగానే ఉన్నాను. మీరూ అంతేనని భావిస్తాను.

నేను అక్కడి నుంచి మొదట తిరుపతి వెళ్ళాను. అక్కడ రంగయ్య ఇంటికి పోయి వాళ్ళ సంగతులన్నీ తెలుసుకున్నాను. తరవాత మా ఊరికి పోయి అక్కడ మా వాన్నతోనూ, ఇంట్లో వాళ్ళతోనూ నాలుగు రోజులు హోరాహోరి పోరాను. ఎందుకో తెలుసా? రంగయ్య కూతురు జ్యోతిని పెళ్ళిచేసుకోవడానికి (ఆశ్చర్య పోకండి). ఎలాగైతేనేం, మా వాళ్ళను ఒప్పించాను. రంగయ్య కూతుర్ని పెళ్ళి చేసుకొని, వాళ్ళ కుటుంబాన్ని ఆదుకోవాలని నిశ్చయించుకున్నాను. ఆ తరవాత మా పెళ్ళికి ముహూర్తం పెట్టడం కూడా అయింది. వచ్చే నెల ఐదున పెళ్ళి. ఇక మీ కథకు ముగింపు దొరికిందనుకుంటాను!

నేను అక్కడికి నాలుగైదు రోజుల్లో వస్తాను. మరో ముఖ్యమైన సంగతి. ఈ ఉత్తరం మీకు చేరే వరకు, మీ కథలో మీరు అనుకుంటున్న విలన్ ఎవరో తెలుసా? నేనే! అంటే, నేనే అప్పుడు రంగయ్యకు కాబోయి మానేసిన అల్లుణ్ణి. అప్పుడు నా చేతగాని తనమే రంగయ్యని బలిగొన్నది. అతను చనిపోయాడని నాకు తెలుసు కాని, అందుకు కారణం పెళ్ళి ఆగిపోవటమేనని నాకు తెలియదు. అసలు ఆ విషయాన్ని గూర్చి నేను ఆలోచించలేదు. కట్నం డబ్బు ముట్టలేదని పెళ్ళి విడిదిలోనించే వెనక్కు తీసుకెళ్ళిన నా తండ్రి మూర్ఖత్వానికి నే నప్పుడు తల వంచక తప్పలేదు.

మిగిలిన సంగతులన్నీ తరవాత మాట్లాడుకొందాం.

మిత్రుడు,

—ఆనందరావు."

మెల్లగా ఉత్తరాన్ని మడిచి పక్కన పెట్టాను. నే నాశించిన ముగింపు ఇదే. ఈ ముగింపు తెలియని రమణ నా కళ్ళ ముందు మెదిలాడు, అప్రయత్నంగా. *